క్లుప్తంగా

టి.సిరసపల్లి రేషన్ డిపో తనిఖీ



టి.సిరసపల్లి రేషన్‌డిపోను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లి రేషన్ డిపోను బుధవారం సాయంత్రం తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తనిఖీ చేశారు. డిపోకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. డిపోకు చేరిన సరకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రేషన్‌కార్డు లబ్ధిదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకోకుంటే ఏప్రిల్‌కు సంబంధించి రేషన్ సరకులను నిలుపుదల చేస్తారన్నారు.

73 శాతం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి



ఎస్.నర్సాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

పాయకరావుపేట: మండలంలో ఇప్పటి వరకు 73 శాతం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మిగిలిన 27 శాతం త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎస్.నర్సాపురం గ్రామంలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్, వ్యవసాయ యంత్రీకరణ బలోపేతం, రాయితీపై యంత్ర పరికరాలు, రైతులకు ప్రభుత్వం కల్పించే మద్దతు ధరలపై ధాన్యం కొనుగోలు, ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ ద్వారా ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు.

చేతిబోరు ఏర్పాటుకు శంకుస్థాపన



పాములవాకలో చేతిబోరుకు శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

కోటవురట్ల: రైతుల పొలాల్లో మంచినీటి సమస్య లేకుండా కృషి చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. పాములవాకలో రైతులు కన్నూరు గోవిందు, కన్నూరు పైడితల్లి, పల్లి చిట్టిబాబు, పోతల నూకరాజు, కొంచా నూకరాజు, కొంచా సత్యవతి వ్యవసాయ మకాముల వద్ద బుధవారం చేతిబోరు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులను సర్పంచ్ డి.సత్యవతి, వార్డు సభ్యులు, రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ చాలా కాలంగా రైతుల మకాములలో మంచి నీటి సమస్య ఉందన్నారు. ఇందు కోసం పంచాయతీ నిధులతో చేతిబోరును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు దివ్యప్రశాంతి 85 మంది రోగులకు నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 20 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ శిబిరం నిర్వహణకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సహాయ, సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, పార్టీ జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులతో నేడు సమావేశం

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులతో గురువారం సమావేశం నిర్వహించనున్నట్టు జనసేన మండల కన్వీనర్ టెక్కలి పరశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే విజయకుమార్ హాజరవుతారన్నారు. బాధితులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ భూతం.. కట్టడి ఎలా?

గుడ్డ, నారతో తయారు చేసే చేతి సంచులను వినియోగించే సంస్కృతి కనుమరుగైంది. మార్కెట్‌కు ఖాళీ చేతులతో వెళ్లి పాలిథిన్ సంచుల నిండా సరకులు తెచ్చుకోవడం.. సరకులు తీసేసి సంచులను విచ్చలవిడిగా బయట పడేయడం ప్రజలకు పరిపాటిగా మారిపోయింది. ఒకప్పుడు బజారుకు వెళితే ఎంచక్కా గుడ్డ సంచో.. నార సంచో చేత పట్టుకుని వెళ్లేవారు. మార్కెట్లో కావాలసిన సరకులు కొనుగోలు చేసుకుని ఆ సంచిలో తెచ్చుకునేవారు. అయితే కాలక్రమంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువైంది. పాలిథిన్ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులు మార్కెట్లో ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి.



పట్టణంలో రైల్వేస్టేషన్ స్కూల్ పక్కన ఖాళీ స్థలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు



డ్రైనేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులు

నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు విఫలం

యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం

సహకరించని ప్రజలు.. జరిమానాలకు భయపడని చిరు వ్యాపారులు

పట్టణంలో ఎక్కడ చూసినా కుప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు

యలమంచిలి రూరల్: ప్రస్తుతం యలమంచిలి పట్టణంలో ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం రాజ్యమేలుతోంది. అవన్నీ మట్టిలోను, మురుగు కాల్వల్లోను ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఆ వ్యర్థాలు భూమిలోకి చేరడంతో భూమి తన ఉనికిని కోల్పోతోంది. పశువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. భూమి లోపల పాలిథిన్ వ్యర్థాలు పెరిగిపోవడంతో ఉష్ణోగ్రత పెరిగి మానవాళికి పెనుముప్పుగా పరిణమించింది.

ఖాళీ ప్రదేశాలు, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు

పట్టణంలో ఎక్కడపడితే అక్కడ కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టణ పరిధిలో ప్లాస్టిక్ సంచుల వినియోగం, అమ్మకం నిషేధం. హోల్‌సేల్, రిటైల్‌గా ప్లాస్టిక్ సంచుల అమ్మకాలు నిషేధించినట్టు అధికారులు ఎన్నిసార్లు ప్రకటిస్తున్నా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం కలుషితమై ప్రాణాంతక వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని అధికారులు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా వ్యాపారులు, ప్రజలు పట్టించుకోవడం లేదు. ఇటీవల పట్టణంలో గత నెల రోజులుగా ప్లాస్టిక్ సంచుల వినియోగంపై అధికారులు తనిఖీలు చేపట్టి దుకాణాల వద్ద నుంచి ప్లాస్టిక్ సంచులను స్వాధీనపర్చుకుంటున్నారు. కొందరికి జరిమానాలు కూడా విధిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది అక్కడ్నుంచి వెళ్లగానే దాచిపెట్టిన ప్లాస్టిక్ సంచులను మళ్లీ యథావిధిగా వినియోగిస్తున్నారు. దీంతో పట్టణంలో రోజూ వస్తున్న చెత్తలో సగం వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల చాలా ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని ప్రజలకు తెలిసినా అనివార్యంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను ఉపయోగిస్తున్నారు. తద్వారా ప్రజలు క్యాన్సర్‌తో పాటు అనేక దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారు.

ప్రజల సహకారంతోనే..



ప్లాస్టిక్ సంచుల నియంత్రణకు ప్రజల సహకారం చాలా అవసరం. పట్టణంలో నిబంధనల మేరకు నిషేధిత ప్లాస్టిక్ సంచులను వినియోగించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజూ తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ సంచులను విక్రయించినా, వ్యాపారులు వినియోగించినా కఠినంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే ప్రజలు, వ్యాపారులకు దశల వారీగా అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టడానికి అందరి సహకారం అవసరం. ప్రజలు మార్కెట్‌కు వచ్చినప్పుడు గుడ్డ సంచులు వెంట తెచ్చుకోవడం అలవాటు చేసుకుంటే ఫలితం ఉంటుంది.

– బీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్స్ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వ్యాపారులు విక్రయించాలి. కానీ పట్టణంలో పలువురు వ్యాపారులు 120 మైక్రాన్స్ మందం ఉన్నట్టు నకిలీ ముద్ర కలిగిన ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పట్టణంలో చిరు వ్యాపారులే ఎక్కువగా నిషేధిత ప్లాస్టిక్ సంచులను అధికారుల కంట పడకుండా ఎక్కువగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా కర్రీ పాయింట్లు, టీ దుకాణాలు, తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న చిన్న కిరాణ దుకాణాలు, పండ్ల రసాల అమ్మకం షాపులు, శివారు గ్రామాల్లో ఎక్కువగా నిషేధిత ప్లాస్టిక్ సంచులను వాడుతున్నారు. టీ, కాఫీలు, వేడివేడిగా మరుగుతున్న సాంబారు, కూరలు, ఇతర ఆహార పదార్థాలతో పాటు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు.



ప్లాస్టిక్ కవర్లో ప్యాక్ చేసిన కాఫీ

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక బృందాలు

ఇటీవల మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో ప్లాస్టిక్ సంచుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిషేధిత ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నియంతించడానికి ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. సుమారు 60 కేజీల వరకు ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. కొందరికి జరిమానాలు కూడా విధించారు. పట్టణంలో ప్రధాన కూడళ్లలో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు పెట్టారు. ప్లాస్టిక్ వినియోగం అత్యంత ప్రమాదకరమని స్వచ్ఛంద సంస్థలు, అధికారులు గొంతు చించుకుంటున్నా.. అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నా ప్రజలు కూడా వాటిని దూరం పెట్టడం లేదు. వెరసి ప్లాస్టిక్ భూతం రోజురోజుకూ తన పరిధిని విస్తరించుకుంటూ ముందుకు సాగుతోంది.



మున్సిపల్ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ నిషేధంపై పెట్టిన ఫ్లెక్సీ

పక్కాగా తడి, పొడి చెత్త సేకరణ



కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: సాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు పక్కాగా తరలించాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై నక్కపల్లి సంపద తయారీ కేంద్రం వద్ద పాయకరావుపేట మండల కార్యదర్శులు, స్వీపర్లకు బుధవారం ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుండీల్లో వేరు చేసిన చెత్తను వేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులను సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లాప్ మిత్రలు, కార్యదర్శి బి.ఎ.బి.ఎల్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

భూఆధార్ రిజిస్ట్రేషన్‌కు ఈ నెలాఖరు గడువు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూఆధార్ రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 31వ తేదీలోగా చేయించుకోవాలని స్థానిక వీఏఏ సింధూజ కోరారు. ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలు అమలవుతాయన్నారు. ఇందుకోసం రైతులు పాస్ పుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు జెరాక్స్‌తో పాటు ఆధార్ లింకైన ఫోన్‌ను తీసుకువచ్చి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

5 పంచాయతీల ఉప సర్పంచ్ పదవులకు నేడు ఎన్నిక

మునగపాక: మండలంలోని ఐదు పంచాయతీలకు గురువారం ఉప సర్పంచ్ పదవులకు ఎన్నిక జరుగుతుందని ఈవోఆర్డీ సోమరాజు తెలిపారు. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా చేసుకున్న ఒప్పందం మేరకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ పదవులకు ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మునగపాక, నాగులాపల్లి, తోటాడ, రాజుపేట, నారాయుడుపాలెం పంచాయతీలలో ఎన్నిక ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

అచ్యుతాపురం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు



పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న వైద్యారోగ్య శాఖాధికారి రవికుమార్

అచ్యుతాపురం రూరల్ : తాగునీటి వనరులను ప్రతి రోజూ క్లోరినేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ సూచించారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వేసవి కాలంలో విద్యుత్ కోతలు అధికంగా ఉన్నందున ఐఎల్ఆర్ డీప్ ఫ్రీజర్ పనితీరును పరిశీలించారు. రోజుకు ఎంత మంది రోగులు ఓపీకి వస్తున్నారు.. బెడ్‌లు సరిపడా ఉన్నాయా? లేదా? అని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్యను అడిగి తెలుసుకున్నారు. 105 రకాల మందులను డిస్‌ప్లేలో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, లేబర్ రూమ్ తనిఖీ, నెలలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో ఎన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారో ల్యాబ్ టెక్నీషియన్ గీతా రాణిని వివరాలు అడిగారు. టీబీ పరీక్షల శాంపిల్స్ రోజుకు ఎన్ని వస్తున్నాయని ప్రశ్నించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ సభ్యురాలు రమ్య

అచ్యుతాపురం రూరల్ : పద్దెనిమిది సంవత్సరాలలోపు పిల్లలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా సంరక్షించుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ క్షేత్ర స్థాయి సభ్యురాలు కె.ఎల్.వి.రమ్య సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై బుధవారం మడుతూరు, దోసూరు గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న పిల్లలతో పనులు చేయించడం, భిక్షాటన చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి పిల్లలు ఎక్కడైనా తారసపడితే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1098, 112కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రతి పంచాయతీలో మహిళా కానిస్టేబుల్ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షుడిగా ఉండి మరో 9 మందితో కూడిన ఒక కమిటీ ద్వారా బడి బయట పిల్లల్ని, పేద పిల్లల్ని, అభాగ్యుల్ని గుర్తించి కేంద్రం ప్రభుత్వం మెషిన్ వాత్సల్య అనే పథకం ద్వారా 2 సంవత్సరాల పాటు నెలకు రూ.4 వేలు అందిస్తూ ఆదుకుంటుందన్నారు. హెచ్‌ఐవీ సోకిన పిల్లలకు, హెచ్‌ఐవీ వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని రమ్య తెలిపారు. ఎవరైె పిల్లలను దత్తత తీసుకోవాలని అనుకుంటే https://cara.wcd.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మడుతూరు సర్పంచ్ మోటూరు సంజీవి, దోసూరు సర్పంచ్ నర్మాల సుజాతరామకృష్ణ, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక నేడు

ఎస్.రాయవరం: మండల ప్రజా పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఇటీవల కోన లోవలక్ష్మి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరుగుతోంది. ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వు కావడంతో పోటీలో ఉత్కంఠ నెలకొంది. మండలంలో 20 ఎంపీటీసీలకు 16 ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ వారే ఉండడంతో అధికార కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఏమాత్రం ఫలించవు. అయితే వైఎస్సార్ సీపీలో ముగ్గురు బీసీ మహిళలు ఉండటంతో ఎవరిని అధ్యక్ష పీఠం వరిస్తుందో వేచి చూడాల్సిందే. వైఎస్సార్ సీపీ నుంచి కొరుప్రోలు, పెట్టుగోళ్లపల్లి, తిమ్మాపురం–2లు బీసీ మహిళలుగా ఉన్నారు. ఇప్పటికే ఇద్దరు బీసీ మహిళలు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరగనుంది.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేయాజ్ ఖాన్

నర్సీపట్నం : సీనియర్ సివిల్ జడ్జి పి.షేయాజ్ ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ బుధవారం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీలకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను పెట్టుకునేందుకు ఆర్థిక స్థోమత లేని వారికి మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. అటువంటి వారు ఎవరైనా ఉంటే వివరాలను జైల్ సూపరిండెంటెంట్ ఎం.సన్యాసిరావుకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది విజయ ప్రసాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దేవవరం మాజీ మునసబు మృతికి సంతాపం



కోన నర్సింహ మూర్తి(ఫైల్)

నక్కపల్లి: దేవవరం మునసబుగా మండల ప్రజలకు సుపరిచితులైన విశ్రాంత వీఆర్వో కోన నర్సింహమూర్తి(77) అనారోగ్యంతో మరణించారు. నర్సింహమూర్తి పటేల్ పట్వారి వ్యవస్థ అమలులో ఉన్నప్పుడు దేవవరం గ్రామానికి మూడు దశాబ్దాల పాటు మునసబుగా పని చేశారు. తదుపరి చినదొడ్డిగల్లులో వీఆర్వోగా విధులు నిర్వర్తించారు. ఈయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో మంచాన పడ్డారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నర్సింహమూర్తి మరణం పట్ల సర్పంచ్ గొర్ల రాఘవకుమారి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, మాజీ ఎంపీటీసీ గొర్ల నర్సింహమూర్తి, మండల వీఆర్వోల సంఘం పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు డి.వి.రామారావు, ప్రగడ సత్యనారాయణ, స్థానిక నాయకులు దేవర అప్పారావు, కె.సూర్యగణేష్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. నర్సింహమూర్తి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

నవోదయలో విద్యార్థుల ప్రతిభ



నవోదయకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట: జవహర్ నవోదయ విద్యాలయ సమితి జనవరి 18న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభకనబరిచారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం కోసం పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ముత్యాల విశ్రుత్, మేడిశెట్టి హవిష్, కొంజర్ల వెంకట చంద్రమౌళి, దూలపల్లి విఖ్యాత్ ఎంపికయ్యారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

పాయకరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పాయకరావుపేట శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా బి.డి.వి.వి.ప్రసాద్, అధ్యక్షుడిగా నల్లల చలపతిరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా సిహెచ్.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చక్కా వెంకటరమణమూర్తి, కోశాధికారిగా గంటి రాజ్యశ్రీ ఎన్నికయ్యారు. మరో నలుగురు ఉపాధ్యక్షులుగా, నలుగురు జాయింట్ సెక్రటరీలుగా, 8 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియామకమయ్యారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.రాయవరం, వాకపాడు, గోకులపాడు, భీమవరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటక ప్రదర్శనలు



అద్దంలో చందమామ నాటకంలోని ఓ సన్నివేశం



రైతు పోరాటం నాటకంలోని ఓ సన్నివేశం

మునగపాక: మునగపాకలోని పరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా స్థానిక కళాకారులు మంగళవారం రాత్రి ప్రదర్శించిన రెండు సాంఘిక నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రైతులే ఈ నాటకాల్లో నటించి మెప్పించారు. సంతబయిల తంపరమూల విశాలాంధ్ర స్టేజీపై అద్దంలో చందమామ సాంఘిక నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ నాటకానికి రచన, దర్శకత్వం విల్లూరి లక్ష్మీ జగన్నాథ్ వహించారు. మండబయిల రామాలయం వద్ద శ్రీలక్ష్మీ యూనియన్ ఆధ్వర్యంలో రైతు పోరాటం నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానిక కళాకారులు నటించి మెప్పించారు. ఈ నాటకానికి దాడి జగన్నాథరావు రచన చేయగా.. దాడి ముసిలినాయుడు దర్శకత్వం వహించారు. రెండు నాటక ప్రదర్శనలను తిలకించేందుకు కళాభిమానులు భారీగా తరలివచ్చారు.

నాగన్నచెరువులో మట్టి అక్రమ తవ్వకాలు



నాగన్నచెరువులో అక్రమంగా జరిపిన తవ్వకాలతో ఏర్పడిన గోతులు

కోటవురట్ల: జల్లూరు రెవెన్యూ పరిధి నాగన్న చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అనుమతి లేకుండా చెరువులోని మట్టిని తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నెల రోజులుగా నిరాటంకంగా తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారం అండతో టీడీపీ నాయకులు అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సిహెచ్.బాలసాయి, జి.శ్రీనివాసు తదితరులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. నాగన్న చెరువులో రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, జేసీబీ ద్వారా మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేసిన చెరువును టీడీపీ నాయకులు తమ స్వార్థం కోసం ధ్వంసం చేస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వందలాది ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారని, అక్రమార్కులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దారు, ఎంపీడీవో, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.